
# గోదావరిలోయలో వనరులకోసం పోరాటం




గోదావరిమీద నేడు జరుగుతున్న క్షీరసాగర మథనం, అంతరించిన వనరులను తిరిగిపొందడంతో ప్రారంభంకావాలి

## మందిని ముంచే అభివృద్ధికాదు - మందికి పంచే అభివృద్ధి కావాలి

'ఉప్పొంగిపోయింది గోదావరీ తాను
తెప్పున్న ఎగిసింది గోదావరీ
కొండల్లు ఉరికింది కోనల్లు నిండింది
ఆకాశ గంగతో హస్తాలు కలిపింది
అడవి చెట్లన్నీ జడలలో తురిమింది
ఊళ్ళు దండల గుచ్చి మెళ్ళోన తాల్చింది ॥

నరమానవుని పనులు శిరమొగ్గి వణికాయి
కరమెత్తి దీవించి కడలికే నడచింది'

- అడవి బాపిరాజు



*Watersheds come in families; nested levels of intimacy. On the grandest scale the hydrologic web is like all humanity..... As you work upstream toward home, you're more closely related. The big river is like your nation, a little out of hand. The lake is your cousin. The creek is your sister. The pond is her child. And, for better or worse, in sickness and in health, you're married to your sink.*

Michael Parfit, National Geographic.


## అడవుల ఆరోగ్యమే - మైదానాల సౌభాగ్యం

## *The health of hills is the Wealth of Plains*

"కలవు గనులును, నదుల జలముల పసిడి పాతర మనదు దేశం - సిరియు సంపద వెల్లివిరిసెడి స్వర్గతుల్యము చేసికుందము" - కొండేపూడి




**శక్తి**, 305, జనప్రియ అబోడ్స్, గాంధీనగర్, హైదరాబాద్ - 500 080. ✆: 040-55614787




## గోదావరి పరీవాహక ప్రాంతం ~నదులు - ఉపనదులు - అడవులు ~

**దండకారణ్యంలో ప్రవహించే గోదావరి బేసిన్ మొత్తం విస్తీర్ణంలో అడవులది చాలా ప్రధాన పాత్ర.** టేకు అడవుల్లో ప్రవహించే వార్ధా, పెన్‌గంగ - వైనగంగలు ప్రాణహితలో కలిసి గోదావరిలోకి ప్రవహిస్తాయి. పెన్‌గంగ పూర్వపు పేరు వేణు (వెదురు) గంగ. కలహండిలో పుట్టిన ఇంద్రావతి బస్తర్‌లో ప్రవహించి కరీంనగర్ జిల్లాలో గోదావరిలో కలుస్తుంది. బస్తర్ అంటే (బాన్స్ స్థలం) వెదుళ్ళ భూమి అని అర్థం. గోదావరిలో ప్రవహించే మరో ఉపనది శబరికి ఉపనదులు సీలేరు, మత్స్యగడ్డ - జలచరాల పేర్లు. సీల అంటే ఎండ్రిక. విశాఖ జిల్లాలో పుట్టిన మత్స్యగడ్డ - ఎండ్రిక పర్వతంనుండి ప్రవహించే ఇతర వాగులతో కలిసి సీలేరుగా మారి శబరిలో కలుస్తుంది. ఇంద్రావతి, శబరి ఉపనదులు గిరిజనులకు ఆహారం, పరిశ్రమలకు మెత్తని కలపనిచ్చే మామిడి, పనస, అడవులగుండా ప్రవహిస్తాయి. ఇప్పపూలు, తునికాకులు, వెదురు, సారపప్పు, జిగురు, చింతపండు, తేనె, వనమూలికలవంటి అటవీ ఫలసాయం గోదావరి పరీవాహక ప్రాంతమంతా దొరుకుతుండేది.



విశాఖ మన్యంలో ఎండ్రిక పర్వతంవలెనే, తూర్పుగోదావరి - విశాఖ సరిహద్దులోగల ధారలదుమ్మకొండనుండి సోకిలేరు, పాములేరు, కన్నేరు, ఏలేరు, బోడిపెట్టవాగు, సీతపల్లివాగువంటి వాగులు ప్రవహిస్తున్నాయి. హిమాలయ పర్వతాలలో ధవళధార పర్వతశ్రేణులు ఎటువంటివో తూర్పుకనుమలలో ఈ ఎండ్రిక, ధారలదుమ్మకొండలు అటువంటివి. ధారకొండ, ధారవాడ, ధారగూడెం, ధారలమ్మ - ఈ పేర్లన్నీ ఆ ధారల వైభవానికి సహస్రనామాలు. మన రాష్ట్రంలోగల 20 అభయారణ్యాలలో 10 ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. **దండకారణ్యంలో అధిక భాగం గిరిజన ప్రాంతం.**


'గలగల గోదారి నీ నడుము వొడ్డానం... ఓ అడవి తల్లి' -గూడ అంజయ్య



## వివిధ రాష్ట్రాలలో గోదావరి పరీవాహక ప్రాంతం ~

'త్ర్యంబకాచలశిఖర జాతయు - తరళమధుర పయఃపునీతయు, పుడమికెల్లను పేరటాలగు-పుణ్యగోదావరి కనంబడె' -సినారె

గోదావరి పరీవాహక ప్రాంతం 3,12,872 చ.కి.మీ.లలో మహారాష్ట్ర 1,52,199 చ.కి.మీ. ఆంధ్రప్రదేశ్ 73,201 చ.కి.మీ., చత్తీస్‌ఘడ్ 65,255 చ.కి.మీ., ఒరిస్సా 17,752 చ.కి.మీ., కర్ణాటకలో 4,405 చ.కి.మీ., మహారాష్ట్రలో 693 కి.మీ. **40% ప్రాణహిత, 20% ఇంద్రావతి 10% శబరి, మిగిలిన నీరు ఇతర కొండవాగుల నుండి గోదావరిలో చేరుతుంది.** తెలంగాణాలో 610 కి.మీ.లు, ఆంధ్రప్రాంతంలో 162 కి.మీ.ల పొడవునా గోదావరి ప్రవహిస్తుంది.





'రాళ్ళరప్పల నడచి కందిన - రామచంద్రుని చరణములపై, శబరితెచ్చిన పుణ్యగోదా - సలిలములు స్పృశియించె లకుమకు' -సినారె








## అభివృద్ధి ~





కాకతీయుల నుండి నిజాంవరకు, రామప్ప, పాకాలవంటి గొప్ప చెరువులు, నిజాంసాగర్‌వంటి ప్రాజెక్టులు నిర్మించారు. తెలంగాణా భౌగోళిక పరిస్థితులకు తగినట్లుగా **అడవుల పెంపకం (టేకు), వ్యవసాయం, పశుపాలన, ముఖ్యంగా గొర్రెల పెంపకం, తునికాకుల సేకరణ, బీడి పరిశ్రమ, నీరా వ్యాపారం, చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందాయి.** పొలాల్లో విస్తారంగా కుంటలు, ఇంటిటా వాననీరు నిల్వచేసుకొనే ఏర్పాటు ఈ ప్రాంతం ప్రత్యేకత.






సర్ ఆర్థర్ కాటన్ **గోదావరి బ్యారేజ్** నిర్మించడమే కాదు - దుమ్ముగూడెం నుండి నదిద్వారా, **కాలువల ద్వారా 847 కి.మీ.ల రవాణా సౌకర్యం** అభివృద్ధి చేశాడు. ఈ సౌకర్యం కలప, వెదురు రవాణాకు, ప్రజల రాకపోకలకు ఉపయోగపడి ఇక్కడి ఆర్థిక వ్యవస్థను వృద్ధిచేసింది. గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలనుండి వెళ్ళిన రైతులు - గోదావరి వరదలు తగ్గాక కొద్ది తడులతో పండే - **వ్యాపార పంటలు**, పొగాకు, మిర్చివగైరాలను ప్రవేశపెట్టారు. మార్కెట్ రవాణాకు గోదారిని - పొగాకు క్యూరింగ్‌కు చుట్టూ దొరికే పుల్ల ఉపయోగించుకున్నారు.

"వనములనుదాటి వెన్నెల బయలు దాటి - తోగులనుదాటి దుర్గమాద్రులనుదాటి
పులులయడుగుల నడుగులు కలుపుకొనుచు - రాళ్ళవాగుదాటి పథాంతరములుదాటి
అచట కిన్నెరసాని నా యాత్మయందు - నిప్పటికి దాని సంగీతమే నడించు....." విశ్వనాథ



5

## పరిశ్రమలు ~

గోదావరి పరీవాహక ప్రాంతంలో దొరికే వెదురు ఆధారంగా స్థాపించిన బలార్షా, సిర్పూర్ - జె.కె. - భద్రాచలం, రాజమండ్రి పేపర్ మిల్లులు గోదావరి, దాని ఉపనదుల తీరంలోనే ఉన్నాయి. పరిశ్రమలన్నింటిలో పేపర్ పరిశ్రమకు ఎక్కువ నీరుకావాలి. కాలుష్యం విడుదలకు అవకాశం కావాలి. ఈ పరిశ్రమలేకాక సింగరేణి కాలరీస్, మణుగూరు భారజల కర్మాగారం, కొత్తగూడెం, రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రాలుకూడా ఈ అవకాశాన్ని వినియోగించుకున్నాయి. ఒక్క సీలేరు నదిమీదే ఐదు జలవిద్యుత్ ప్రాజెక్టులు వెలిశాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం తెలంగాణా అభివృద్ధిలో ఒక మైలురాయి. ఈ అభివృద్ధి పథకాలన్నీ ఈ ప్రాంతంలో బలహీనవర్గాలను ముఖ్యంగా గిరిజనులను లోపలికి తరిమివేసాయి. గిరిజన ప్రాంతాలలో చిన్న తరహా నీటిప్రాజెక్టుల కింద సాగులోకి వస్తున్న పొలాలు గిరిజనేతరుల పరం అవుతున్నాయి. **ఈ పరిస్థితులు 'ఇంద్రవెల్లి'లో మారణకాండకు దారితీశాయి.**






6

**క్షీణదశ ~**

**గోదావరి పరీవాహక ప్రాంతం ఎంత సుసంపన్నమైనదో - అంత సున్నితమైనది. ఎంత సారవంతమైనదో - సమతుల్యత తప్పితే అంత ప్రమాదరకమైనది.** ఇటువంటి పరీవాహక ప్రాంతంలో పర్యావరణానికి పట్టిన క్షీణదశ 1986 గోదావరి వరదలనుండి స్పష్టంకాసాగింది. అప్పటిదాకా ఒండ్రు తెచ్చిన గోదావరి - ఇసుక, రాళ్ళు కుమ్మరించసాగింది. కొండరాళ్లు నదుల ఒడిలో పడసాగాయి. దీనితో ఏనాటినుండో మనం ఆశపెట్టుకున్న పోలవరం ప్రాజెక్ట్ ప్రతిపాదనల మీద కేంద్రం ప్రశ్నలు గుప్పించడం మొదలుపెట్టింది.



క్షీణించిన భూభాగాలను స్థిరీకరించడానికి - రూ. 250 కోట్లు ఖర్చు అవుతాయి. ఈ క్షీణదశ ఇంకా తీవ్రతరంకాకుండా చర్యలు చేపట్టవలసిందిగా 1988లో కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ("పోలవరం ప్రాజెక్టు మంజూరుకు కేంద్రం పెట్టే షరతులను పూర్తిగా త్రోసిపుచ్చడానికి వీలులేదు. ..... 'క్యాచ్‌మెంట్' ప్రాంతాన్ని (అరగాణి) ప్రాజెక్టు అవసరాలకు తగినట్టుగా సరిచేయాలని కేంద్రం పెట్టిన మరొక షరతు. అంటే ఆ ప్రాంతంలో మొక్కలను పెంచడం, భూమి కోతను నిరోధించడానికి చెక్‌డ్యాము, మట్టి డ్యాములను నిర్మించడం మొదలైనవి. షరతులన్నింటిని పూర్తిచేస్తేనే ప్రాజెక్టుకు అనుమతించగలమని కేంద్రం అంటున్నది". - ఆంధ్రజ్యోతి సంపాదకీయం, జూన్ 5, 1988) ఆ ఖర్చు భరించలేనని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది.



1990నాటికి మన అడవులలో వెదురు ఖాళీఅయింది. వెదురు ఎప్పుడు పెరిగేదే కాని నశించేదికాదు. దాన్నికూడా నాశనంచేసిన ఘనత మనది. **లక్షలాది గిరిజనులకు వెదురు నరుకు ఉపాధిపోయింది.** పేపరు మిల్లులు కొంతకాలం కలప/పుల్లమీదలాగించాయి. అదికూడా లభ్యంకాక సుబాబుల్, సరుగుడు, యూకలిప్టస్ పెంపకాన్ని ప్రోత్సహించి రైతులనుండి కొనుగోలు చేయసాగాయి. అడవులలో కలపమీద ఆధారపడ్డ రంపపు మిల్లులు, లాగింగ్ డివిజన్లు మూతపడ్డాయి. ఈనాడు అటవీ శాఖకు, ప్రజలకు మిగిలిన అంతంతమాత్రపు ఆదాయపువనరు బీడిఆకులొక్కటే.



ఇసుక మేటలు నిండిన గోదావరిలో రవాణా 40-50 కి.మీ.లకే పరిమితమయ్యింది. ఏలేరు రిజర్వాయర్‌ద్వారా విశాఖనగరం అవసరాలు తీర్చవచ్చు అనే ఆశలు అడియాశలయ్యాయి. వారికి గోదావరి నీరే దిక్కయింది. అడవుల నరికివేతవల్ల నిరంతరంపారే వాగులు, వంకలు, ఊటలు, జలపాతాలు ఇంకిపోతున్నాయి. వరదలు మెరుపువేగంతో వెల్లువెత్తి భూమిని కోసేస్తున్నాయి. నీరు ఇంకడంలేదు. **అడవులతోపాటు నీటివనరులుకూడా అంతరిస్తే గిరిజనులు కొండ ప్రాంతాలను వదలిరావలసివుంటుంది.**

*"The scheduled areas in the district are the catchments area for Yeleru river and a large number of other minor streams and springs which provide irrigation and drinking water in the tribal areas are in the upland. These springs and streams are fast drying up and there is perceptible change in the ecological balance in the Agency area".*


*- M.V.P.C. Sastry, IAS,*
*Collector, East Godavari dt. 3.6.1987.*



ప్రాజెక్టులకింద పొలాలకు నామమాత్రపు పన్నుకే నీరందుతుంటే వేలాది రూపాయలతో బోరు తవ్వుతున్నరైతు చితికిపోతున్నాడు. ఇంత డబ్బుపోసి పైకి తెచ్చుకున్న భూగర్భ జలాలను పొదుగుకోసి పాలు తాగినట్లు చేసుకున్నాం. బోరుబావుల ఆధారంగా పెరిగిన అభివృద్ధి కుప్పకూలుతున్నది. మరమగ్గాల ప్రవేశంతో పనులు కోల్పోయిన చేనేతవారు చాలామంది ముంబాయి వలసపోయారు. పత్తిపంటతోపాటు బాలకార్మికులు పెరిగారు. రైతులు, నేతపనివారి ఆత్మహత్యలు నిత్యకృత్యం అయిపోయాయి. 1997 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం **గిరిజన ప్రాంతంలో నిర్వాసితులందరినీ గనులలో, పరిశ్రమలలో వాటాదారులను చేయాలి.** ఈ యాజమాన్యాలు తమ బడ్జెట్‌లో **20% నిర్వాసితుల అభివృద్ధికి ఖర్చుపెట్టాలి.** కాని ఆ ఊసెత్తేవాడేలేడు.

తెలంగాణా మొత్తంమీద **చెరువులకింద సాగు** 1956-57లో 4,47,000 హెక్టారులుండగా అది 1995 నాటికి 2,26,000 హెక్టార్లకు **పడిపోయింది. మెట్టపంటల సాగు తగ్గింది.** 1981-84లో జొన్న 13,63,139 హెక్టారులుండగా, అది 1990-93 నాటికి 7,97,864కు పడిపోయింది. అలాగే సజ్జ 1,94,863 హెౕలనుండి 64,398కి, మొక్కజొన్న 3,17,098నుండి 2,55,863కి పడిపోయాయి. వీటికి బదులుగా పొద్దుతిరుగుడు 500%, పత్తి 100% మేర సాగు పెరిగింది. **డెల్టాలో ఆయకట్టు మూడునుండి పదిలక్షల ఎకరాలకు పెరిగితే - తెలంగాణాలో ప్రాజెక్టులకింద ఆయకట్టు పడిపోయింది.** (తెలంగాణా - సింహాద్రి, విశ్వేశ్వరరావు, 1998). డెల్టాలో ముంపు బాధ పెరిగితే - అరగాణిలో ఇసుక మేటలవల్ల పూడిక పెరుగుతుంది.

## పెరుగుతున్న ఇసుకమేటలు - చొచ్చుకువస్తున్న సముద్రం ~




1977-2002 వరకు గోదావరి నది - దాని కోస్తాను అధ్యయనం చేసిన ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇలా హెచ్చరించింది - **'గోదావరి నదిలో 1972-79 సగటున సంవత్సరానికి 145 మిలియన్ల ఒండ్రువస్తుంటే అది 1997-98నాటికి 57 మిలియన్ టన్నులకు పడిపోయింది.** సముద్రం అలలు ఒడ్డున ఉన్న ఒండ్రును లోపలికి లాగేసుకుంటున్నాయి. 1976-2001 మధ్యకాలంలో సముద్రం 40.83 కి.మీ. భూభాగాన్ని కబళించింది. కాగా ఒండ్రువల్లతేలిన భూభాగం 29.67 చ.కి.మీ. మాత్రమే. నీలరేవు ముఖద్వారంలో మడ అడవులు 200 కి.మీ.లనుండి 140 కి.మీ.లకు తగ్గిపోయాయి. స్వతంత్రం వచ్చిన నాటినుండి ఆనకట్టల ద్వారా నిల్వచేసే సామర్థ్యం 12 రెట్లు పెరిగింది. కాని గరుకైన ఒండ్రు ప్రవాహంలో కొట్టుకుపోయే విధంగా ఆనకట్టల డిజైన్లలో మార్పుచేయకపోతే పూడికవల్ల ఈ నీటినిల్వ సామర్థ్యం గణనీయంగా పడిపోవచ్చు'.

పడిపోవచ్చు కాదు - పడిపోయింది. **'శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నలభై అడుగుల ఇసుక మేటవేయడంతో ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం పడిపోయింది.** శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఇసుక మేటలు తొలగించే అవకాశంలేదని ఇంజనీర్లు చెబుతున్నారు. సిల్ట్ అరెస్టింగ్ ట్యాంకులవల్లకూడా పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. **పాపికొండల ఎగువ ప్రాంతంలో దాదాపు 550 కి.మీ. దూరంలో ఇసుక మేటలవల్లనీరు నిల్వ లేకపోవడం, తీరప్రాంత వాసులనే కాదు ప్రత్యేకంగా తెలంగాణా వాసులను కూడా ఆందోళనకు గురిచేస్తుంది'.** నిజాంసాగర్ పూడిపోవడమేకాదు - 2004 లో ఎండిపోయింది ! మంజీరా నదిలో నీళ్ళన్నీ జంటనగరాలకు సరిపోవడంలేదు. కృష్ణా, గోదావరి నీటికోసం తపిస్తున్నాయి. కృష్ణా గోదావరీ నదులమధ్య ఏర్పడిన మంచినీటి సరస్సు 'కొల్లేరు' నశిస్తున్నది.

## ప్రభుత్వంచేపట్టే పథకాలు ~

పోలవరం ప్రాజెక్ట్ద్వారా ఎకరానికి నీరందించడానికి అయ్యే ఖర్చు ఒక లక్షా యాభైవేల రూపాయలు. భూపతిపాలెం రిజర్వాయర్ ద్వారా మెట్ట పంటలకు నీరందించడానికి అయ్యే ఖర్చు రూ. 50 వేలు. దేవాదుల ఎత్తిపోతల పథకం నిర్వహించడానికి ఎకరానికి రూ. 7200 ఖర్చు అవుతుందని, అటువంటి పథకాలు ఎన్నోచోట్ల నిరర్థక ఆస్తులుగా మిగిలిపోయాయని నిపుణులు చెబుతున్నారు. నాడు క్యాచ్మెంట్ స్థిరీకరించడానికి వట్టిచేతులు చూపించిన ప్రభుత్వాలు ఇప్పుడు పూడిపోయే ప్రాజెక్టులకోసం వేలాదికోట్లు ఖర్చు పెడుతున్నాయి! గోదావరిమీద తలపెట్టిన ప్రాజెక్టులన్నిటికీ నీరు ఎక్కడినుండి వస్తుంది? దాన్ని ఎలా పంపకంచేస్తారు? అనే సంశయాలకు సమంజసమైన సమాధానం దొరకడంలేదు. **నదిమీద పెత్తనం తమ చేతికి తీసుకోవాలన్న తొందరే తప్ప - ప్రభుత్వానికి బేసిన్ మొత్తాన్ని అభివృద్ధిచేసే ఉద్దేశ్యంలేదు.** మేధావుల ఆలోచనలుకూడా నీటి కొట్లాటలచుట్టూ మాత్రమే తిరుగుతున్నాయి.




## పర్యావరణ ప్రమాదాలు ~



ఇంజనీర్లలో పర్యావరణంపట్ల అవగాహనగల స్వర్గీయ శ్రీ రామకృష్ణయ్యగారు ఈ పరిణామాలగూర్చి తన వ్యాసాల ద్వారా నిరంతరం హెచ్చరించేవారు. 'గోదావరి మీద పాత ఆనకట్ట శిథిలమైతే, దానికి బదులుగా కొత్తగా బ్యారేజీ నిర్మించారు. దీనివల్ల నదీగర్భంలో వరద ప్రవాహమార్గం సుమారు ఆరోవంతు తగ్గిపోయింది. అంతేకాదు బ్యారేజీ ఎగువన పోలవరంవరకు నదీగర్భంలో మేటలు బాగాపెరిగిపోయినట్లు తెలుస్తోంది'. **'పోలవరం ప్రాజెక్టువల్ల - గోదావరి, కృష్ణా డెల్టాలలో సుమారు మూడు లక్షల ఎకరాలలో తొలకరి పండదు. మురుగు సమస్య తీవ్రమౌతుంది.** ముఖ్యంగా పశ్చిమగోదావరి డెల్టా నష్టపోతుంది. **బుడమేరు వరద ఇంకా ఉధృతమౌతుంది.** విజయవాడ పట్టణానికి ప్రమాదం తప్పదు! మురుగు కాల్వల్లో సముద్రపు నీరు ఎగదన్నడంవల్ల ప్రవాహం తగ్గిపోతుంది. డెల్టాలో దుర్భర పరిస్థితులేర్పడ్డాయి. **లక్షల మందికి పునరావాసం కల్పించవలసివస్తుంది**'. ఇప్పుడు అటు ఇటూ ఎత్తిపోతలకోసం ఒక కాలువ - పోలవరం నీటికి మరొక కాలువ తవ్వుతున్నారు కాబట్టి ఈ ప్రమాదాలు మరీ ఎక్కువ కావచ్చు.





గోదావరి ఇసకపర్రగా మారుతున్న క్రమం

11

## నిర్వాసితుల జీవనవిధానాలు ప్రాజెక్టుల మనుగడను శాసిస్తాయి ~



ప్రభుత్వం ప్రాజెక్టులు కట్టేముందు నిర్వాసితుల సమస్యను దృష్టిలో పెట్టుకోవాలి. నిర్వాసితులైన తరువాత వారికి లభ్యమయ్యే జీవన విధానాలే - ప్రాజెక్ట్‌ల మనుగడను శాసిస్తాయి. నిర్వాసితులు పైపై ప్రాంతాలకు వెళ్ళి వ్యవసాయంకోసం అడవులు నరికివేసి - పుల్లలమ్ముకొని మనుగడ సాగిస్తారు. దానివల్ల భూమి దిగజారి ప్రాజెక్టులు తొందరగా పూడికపడతాయి. ప్రాజెక్టులు నిండేవరకు, ఎగువ ప్రాంతంవారిని నీటినివాడుకోకుండా అదుపుచేస్తారు. జలాశయం మధ్యలో రాకపోకలు నిషేధిస్తారు. కాబట్టి వారు అధికారులతో ఘర్షణ పడుతుంటారు. పల్లపుప్రాంతాలమీద కక్ష పెంచుకుంటారు. తమ వాటాకోసం ఉద్యమాలు చేపడతారు. **ఏదిఏమైనా ఇప్పటికే ధ్వంసమైన గోదావరిలోయకు నిర్వాసితుల భారాన్ని - తట్టుకునే శక్తిలేదు.**



## నదీ ధర్మాన్ని మరిచిపోకూడదు ~




ప్రస్తుత అవసరాలకు తగినంత మాత్రమే వాడుకుంటూ **నష్టపరిచిన వనరులను భర్తీచేయడం ఈ తరం కర్తవ్యం.** వనరులంటూవుంటే భావితరాలు తమ మనుగడకు అవసరమైన పథకాలను రూపొందించుకోగలరు. వారికోసం ఇప్పుడే మనం అడుగడుగునా నిర్మాణాలు చేపట్టనక్కరలేదు. **నది ప్రవహిస్తుంటేనే కాలుష్యం కొట్టుకుపోతుంది - సముద్ర జలాలు చొచ్చుకురాకుండా నిరోధిస్తుంది.** నదీజలాలు వృధాగా సముద్రంలో కలిసిపోతున్నాయి - ప్రతిచుక్కనీరు వాడుకోవాలి అని ఆశపడేటప్పుడు ఈ నదీ ధర్మాన్ని మనం మరచిపోకూడదు.

*"River serves when it flows" - "నదీ వేగేన శుధ్యతి"*

12

## సన్నగిల్లుతున్న సామరస్యం ~



మునిగేవారు - లబ్ధిపొందేవారు - పరీవాహక (ఎగువ) ప్రాంతంలో ఉండేవారు - కలసి ఒక ఒప్పందానికి వచ్చిన తరువాత ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి అనే 'వరల్డ్ కమిషన్ ఆఫ్ డ్యామ్స్'వారి సూచనలు, సత్యయుగంనాటి మాటలుగా వినిపించవచ్చు. కాని వనరులు అడుగంటిపోతున్న ఈ తరుణంలో మానవ జాతి మనుగడకు మిగిలినమార్గం ఇదొక్కటే.

వివిధ రాష్ట్రాలగుండా ప్రవహిస్తున్న నదుల మీద ఆనకట్టల నిర్మాణాలు రోజురోజుకూ కష్టతరమవుతున్నదృష్ట్యా - రాష్ట్రంలో ముఖ్యంగా కొండప్రాంతాలనుండి ప్రవహించే వాగులమీద రిజర్వాయర్లు కట్టుకుపోతున్నారు. చాలాచోట్ల పరీవాహక ప్రాంతం, ముంపుకు గురయ్యేప్రాంతం గిరిజన ప్రాంతంలో ఉంటే - సాగులోకివచ్చే ప్రాంతం మైదానప్రాంతంలో ఉంటున్నది. **పరీవాహక ప్రాంతంలో గిరిజనుల ఉపయోగంకోసం కొత్తగా చిన్న చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టినా, రిజర్వాయర్‌లోకి వచ్చే నీరు తగ్గిపోతుందని మైదానప్రాంతంవారు అభ్యంతరపెడుతున్నారు.**

**ఇచ్చిపుచ్చుకునే కట్టుబాట్లున్న గిరిజనులకోసం రిజర్వాయర్‌లు కట్టేచోట్లకూడా నిర్వాసితుల సంగతి ప్రభుత్వమే చూసుకోవాలి అనే ధోరణులు పెరుగుతుండడం విచారకరం.** తూర్పుగోదావరి గిరిజన ప్రాంతంలోగల భూపతిపాలెం రిజర్వాయర్ వద్దని, లేదా స్థలం మార్చమని, దెబ్బతినే ఏడు గిరిజన గ్రామ సభలు తీర్మానిస్తే - లబ్ధిపొందే నలభై గిరిజన గ్రామాలు రిజర్వాయర్ కట్టాలి అని తీర్మానించాయి. ప్రత్యామ్నాయ మార్గాలగూర్చి వారు పట్టించుకోలేదు. **అరగాణి - మాగాణి ప్రాంతాలమధ్య వైరుధ్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.**

సప్తర్షులు గోదావరిని తీసుకొస్తుంటారు. దారిలో రాక్షసులుంటారు. గోదావరి వారి ప్రదేశాలను ముంచెత్తుతుంది. గోదావరి ఎండిపోవాలని వారు శపిస్తారు. వారి ప్రదేశం పూజార్హత కోల్పోతుందని ఋషులు శపిస్తారు. ఇరువర్గాలు తుల్యభాగుని మధ్యస్థంలో రాజీపడి తమ శాపాలను కొంత సడలిస్తారు. ఆయన గోదావరిలో ఒక పాయ తన వెంట తీసుకువెళతాడు. ఆ పాయకు తుల్యభాగ అనే పేరువచ్చింది.




## అపోహలు ~

'చాలామంది నీటిసౌకర్యం కల్పించగానే దారిద్ర్యం ఆ ప్రాంతంనుండి తొలగిపోతుందనుకుంటారు. కాని ఇది నిజంకాదు. **చాలా ప్రాజెక్టులు ఒక పంట లేదా తేలికరకం పంటలు వేయడానికి ఉద్దేశించినవి.** వందశాతం నీటి సౌకర్యం కల్పించినా, 90 పనిదినాలకంటే ఎక్కువ ఉపాధి కల్పించవు'. (శ్రీ టి. హనుమంతరావు, ది హిందు, 15-2-2005). **వ్యవసాయేతర జీవనాధారాలపట్ల ఎక్కువ శ్రద్ధవహించాలి.**

## అవసరాలు ~

'ప్రపంచంలో కోట్లాది జనాల పొలాలు ఎత్తునఉండడంవల్ల నీరెక్కడంలేదు. ఎక్కువ ఖర్చుతో మైదాన ప్రాంతాలలో కట్టే కట్టడాలు అక్కడ గిట్టుబాటుకావు. **వారు భరించగల పరిష్కారాలు కావాలి**'. ('ది స్టేట్ ఆఫ్ ది వరల్డ్ 2000, వరల్డ్ వాచ్ ఇన్‌స్టిట్యూట్'). 'చైనాలో పరిశ్రమలో వినియోగించే ఒక క్యూబిక్ మీటర్ నీరు, వ్యవసాయంలోకంటే ఎక్కువ ఉద్యోగాలు - ఎక్కువ లాభాలు తెచ్చిపెడుతున్నది'.

... ఇలయొకింతైన కుంట కాల్వలు రచించి
నయము పేదకు, అరి కోరు అను వొసంగి
ప్రబలజేసిన అర్థధర్మములు పెరుగు - కృష్ణదేవరాయలు



## ముందుతరాల అవసరాలు - తక్షణ సమస్యలకు పరిష్కారాలు ~




ఈ నేపథ్యంలో మొత్తం బేసిన్ క్షేమం - ముందుముందు తరాల అవసరాలు, వనరుల లభ్యతను దృష్టిలోపెట్టుకొని తక్షణావసరాలుతీర్చే పరిష్కారాలు వెతుక్కుంటూ - ఈ బేసిన్‌కు జరిగిన నష్టాన్ని భర్తీచేయవలసిన దిశలో ఆలోచించాలి. ఇంతవరకు సాధించుకోలేని, దృష్టిసారించని అవకాశాలను ఆచరణలోకి తేవాలి.

★ గోదావరిలో అడవులలో వెదురు సంపదను, అక్కడి గిరిజనుల భాగస్వామ్యంతో అభివృద్ధిచేసి - భూమి కోతను అరికట్టడం, వారి ఉపాధి అవకాశాలు పునరుద్ధరించడం ~


★ 'రైతు సంఘాల సమాఖ్య'వారు కోరినట్లు కృష్ణా డెల్టాకు ఏలూరు కాల్వద్వారా 15 టి.యం.సిల నీరు ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలు సరఫరా చేయడం ~

★ 'గోదావరి ఐక్య వేదిక'వారు సూచించినట్లు చెరువులు స్థిరీకరించి, వాటిని నింపడం ద్వారా సాగునీటిసౌకర్యం, భూగర్భ జలాలవృద్ధికి కృషిచేయడం ~













★ గోదావరి డెల్టాలో కొబ్బరి ఉత్పత్తులు - కేరళ స్థాయిలో అభివృద్ధి చేయడం ~

★ తీర ప్రాంత అభివృద్ధి సంస్థద్వారా - కోతనరికట్టే వనాలు పెంచడం ~

★ నదీ మార్గంలో రవాణా సౌకర్యాలను అభివృద్ధిచేయడం ~



★ మెట్ట పంటలకు మద్దతు ధర ప్రకటించి ప్రోత్సహించడం. మెట్ట ప్రాంతాలకు నీటిని తోడే రకరకాల పరికరాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ~

★ స్థానిక నీటివనరులను బలిపెట్టి - మంచినీళ్ళు - వందలాది కి.మీ. సరఫరాచేసే విధానాల మీద ఆంక్షలు విధించడం. వర్షపునీరు నిల్వచేసుకోవడం, గొట్టపు బావులను రీఛార్జ్ చేసుకోవడం, వాడిన నీటిని పరిశ్రమలు ఉపయోగించుకోవడంవంటిపద్ధతులు తప్పనిసరి చేయవచ్చు. నీటి వినియోగం తగ్గించుకొనేవారికి ప్రోత్సాహకాలు ప్రకటించవచ్చు ~

## అరగాణి ఆరోగ్యం - మాగాణి సౌభాగ్యం









## సమగ్ర నీటివనరుల యాజమాన్యం(ఐ.డబ్ల్యూ.ఆర్.ఎం.) ~

ఈ యాజమాన్యంలోముఖ్యమైన అంశం పర్యావరణ వ్యవస్థలను పరిరక్షిస్తూనే నీరు, భూమి, ఇతర వనరులను సమన్వయంతో నిర్వహించడం తద్వారా గరిష్ట స్థాయిలో సామాజికాభివృద్ధి సాధించడం (ఆంధ్రప్రదేశ్ జల దార్శనికత). ఈ సూత్రాల ప్రకారం **బేసిన్‌లోని ప్రతి ఇరవై వేల హెక్టార్లలో వివిధ లబ్ధిదారులవేదికలను, బేసిన్‌స్థాయిలో ఒక సమాఖ్యను ఏర్పరచవచ్చు.** ఈ లబ్ధిదారుల వేదికలు, తమ తమ ప్రాంతాలలో ప్రత్యేక అవసరాలను బేసిన్ స్థాయిలో ప్రణాళికలు రూపొందించేటప్పుడు సమాఖ్య దృష్టికి తీసుకురావచ్చు. తగిన ఏర్పాట్లుకై పట్టుబట్టవచ్చు. ఇటువంటి వేదికల నిర్మాణంకోసం దాతలుకూడా నిధుల కురిపిస్తున్నారు కాబట్టి ఈ సమాఖ్యలు త్వరలోనే రూపందాల్చే అవకాశం ఉంది. **వనరుల, జీవనాధారాల వైవిధ్యంపట్ల ఈ వేదికలు శ్రద్ధవహిస్తాయి. నదిలో నీళ్ళకే పరిమితమైన దృక్పథాలను మారుస్తాయి** లేదా అన్ని భాగస్వామ్య విధానాలవలె ఇవికూడా ప్రచారానికి పరిమితమై నీరుగారిపోయే అవకాశాలుకూడా లేకపోలేదు.



"ఉన్నవాళ్ళకు ఎంతనేలా - దున్నుకుంటే చాలుతుందో
మించి ముట్టరుకూడ పైనా - చిన్న చెక్కయినా -
అందరికి కావలసినంతా - వుంది, యెవ్వరితోడ నెవరికి !
ఎన్నడూ చూడలేమన్నా - చిన్ని తగవైనా....." కోకిలమ్మ పెండ్లి







## పొరుగు రాష్ట్రాలతో ద్వైపాక్షిక, దౌత్య సంబంధాలు ~

ఈ ప్రత్యామ్నాయాలతోపాటు ఈనాటి రాజకీయ వాతావరణంకూడా దృష్టిలో ఉంచుకోవాలి. తోటి రాష్ట్రాలతోకూడా, తోటి దేశాలతోవలె మెలగవలసిన పరిస్థితులొచ్చాయి. నీటి పంపకం విషయంలో కేంద్రం సలహాలుగాని - ట్రిబ్యునల్ పరిష్కారాలుగాని - కోర్టు తీర్పులుగాని పనిచేయడంలేదు. **ఎవరి లెక్కలు, లొసుగులు వారికి ఉన్నాయి.** పొరుగు రాష్ట్రంలో ఏంజరుగుతుందోకూడా తెలియడంలేదు. కాబట్టి హక్కులను వల్లించడం తగ్గించి, పై రాష్ట్రాలతో ద్వైపాక్షిక ఒప్పందాలు - వాణిజ్య ఒడంబడికలు, దౌత్యసంబంధాలు ఏర్పాటు చేసుకొని మన అవసరాలకు కావలసిన నీటికి అడ్డంకులు లేకుండా చూసుకోవడం అవసరం. **కేవలం నీటికి మాత్రమే పరిమితంకాక పరస్పర అవసరాలు, అవకాశాలు ఆధారంగా ఈ ఒప్పందాలు జరగాలి.** గతంలో మన ముఖ్యమంత్రి కర్ణాటకలో నీటిపారుదల ప్రాజెక్టుకు శంఖుస్తాపనచేస్తే, కర్ణాటక ముఖ్యమంత్రి మన రాష్ట్రంలో ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేయడంవంటి సత్సంబంధాలను పునరుద్ధరించుకోవాలి.





## గోదావరి లోయలోగల జిల్లాలు, అభయారణ్యాలు, గిరిజన ప్రాంతాలు ~




| జిల్లాలు | అభయారణ్యాలు | గిరిజన ప్రాంతం |
|---|---|---|
| **ఆంధ్రప్రదేశ్** | | |
| 1. ఆదిలాబాద్ | కవ్వాల్, ప్రాణహిత, లంజమడుగు (శివరాం-జింకలు) | ✓ |
| 2. కరీంనగర్ | లంజమడుగు (శివరాం-జింకలు) | ✗ |
| 3. నిజామాబాద్ | పోచారం | ✗ |
| 4. మెదక్ | మంజీర; పోచారం | ✗ |
| 5. వరంగల్ | ఏటూరునాగారం, పాకాల | ✓ |
| 6. ఖమ్మం | కిన్నెరసాని, పాపికొండ | ✓ |
| 7. పశ్చిమగోదావరి | పాపికొండ | ✓ |
| 8. తూర్పుగోదావరి | పాపికొండ(అడవిదున్న), కోరింగ | ✓ |
| 9. విశాఖ | | ✓ |
| **మహరాష్ట్ర** | | |
| 1. అహ్మద్‌నగర్ | --- | ✓ |
| 2. ఔరంగాబాద్ | --- | ✓ |
| 3. భాంద్రా | నగ్జిరా, నవేగావ్ నేషనల్ పార్క్ | ✓ |
| 4. చాందా | --- | ✓ |
| 5. నాగపూర్ | పెంచ్ నేషనల్ పార్క్; బోర్ గేమ్ | ✓ |
| 6. నాందేడ్ | --- | ✓ |
| 7. నాసిక్ | నందూర్ మధ్యమేశ్వర్ | ✓ |
| 8. ఉస్మానాబాద్ | యేడి-రాంలింగ్ ఘాట్ | ✓ |
| 9. పర్భాని | --- | ✓ |
| 10. వార్ధా | బోర్ గేమ్ | ✓ |
| 11. యావత్మాల్ | పైనగంగ (కిన్‌వాత్); తిపేశ్వర్ | ✓ |
| 12. గడ్చిరోలి | భామ్రాగడ్; ఛాప్రాలా | ✓ |
| **మధ్యప్రదేశ్** | | |
| 1. ఛింద్వారా | పెంచ్ (పులులు) | ✓ |
| 2. సియోని | పెంచ్ | ✓ |
| 3. బాలాఘాట్ | --- | ✓ |
| **ఛత్తీస్‌ఘడ్** | | |
| 1. బస్తర్ | బైరాంఘడ్ (అడవిగేదె); పామేడ్; ఇంద్రావతి(పులులు); కంగేర్‌ఘాటీ | ✓ |
| 2. రాజ్‌నందన్‌గావ్ | --- | ✓ |
| **ఒరిస్సా** | | |
| 1. కోరాపుట్ | --- | ✓ |
| 2. గజపతి | --- | ✓ |
| 3. నవరంగ్‌పూర్ | --- | ✓ |
| 4. మల్కన్‌గిరి | --- | ✓ |
| 5. కలహండి | కర్లాపట్ | ✓ |
| **కర్ణాటక** | | |
| 1. బీదర్ | --- | ✓ |

## ఆంధ్రప్రదేశ్ గిరిజనప్రాంతంలో నిర్మిస్తున్న/నిర్మించిన నీటిపారుదల, జలవిద్యుత్ ప్రాజెక్టులు ~

| జిల్లా | సబ్‌బేసిన్ | ప్రాజెక్టులు |
|---|---|---|
| 1. ఆదిలాబాద్ | మధ్యగోదావరి, పెన్‌గంగ, వార్ధా, ప్రాణహిత | కడం, దిగువ పెన్‌గంగ, ప్రాణహిత సాత్నాల, చెలిమలవాగు ప్రాజెక్ట్, వట్టివాగు(రెండు దశలు), పి.పి.రావు ప్రాజెక్టు, సుద్దవాగు, పెద్దవాగు, గొల్లవాగు, రాలివాగు, నీల్వాయి (పెద్దవాగు), బర్కగూడెం (పెద్దవాగు) దస్నాపూర్ (పెద్దవాగు), కొమరంభీం ప్రాజెక్ట్ (పెద్దవాగు), మత్తడివాగు, ఒట్టివాగు, సాత్నాల, ప్రాణహిత |
| 2. వరంగల్ | మానేరు, దిగువగోదావరి | శాలివాగు, లఖనవరం, మల్లూరు వాగు, రామప్పలేక్ |
| 3. ఖమ్మం | కిన్నెరసాని | కిన్నెరసాని, తాలిపేరు, గుండాల వాగు, మొండికుంటవాగు, ముర్రేడు వాగు, పాలెంవాగు, గుండ్లవాగు, పెద్దవాగు, పోలవరం, దుమ్ముగూడెం |
| 4. పశ్చిమగోదావరి | దిగువగోదావరి, కొవ్వాడకాల్వ, ఎర్రకాల్వ | కొవ్వాడకాల్వ, జల్లేరు, పోలవరం |
| 5. తూర్పుగోదావరి | సీతపల్లివాగు, పాములేరు వాగు, సీలేరు, బురదకాల్వ, తొర్రిగడ్డ, ఏలేరు, పంప, సుద్దగడ్డ, తాండవ | సూరంపాలెం, భూపతిపాలెం, ముసురుమిల్లి, మద్దిగడ్డ, తొర్రిగెడ్డ బందకాల్వ, పోలవరం, ఛాగల్నాడు దిగువ సీలేరు (డొంకరాయి) |
| 6. విశాఖ | మత్స్యగడ్డ, సీలేరు | ఎగువ సీలేరు |

